జిల్లా నేతల ప్రచారం

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఆ పార్టీల జిల్లా నేతలు స్థానిక నాయకులతో కలిసి శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. డివిజన్లు, బూత్‌లకు చెందిన స్థానిక నేతలను వెంట పెట్టుకొని జిల్లాల నేతలు అర్ధరాత్రి వరకు ప్రచారం సాగించారు. పలు ప్రాంతాల్లో ఓటరు స్లిప్పులు పంచుతూ తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలంటూ అభ్యర్థించారు.

ఆటో డ్రైవర్ల మద్దతు

ఎర్రగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు నవీన్ యాదవ్‌కు మద్దతు తెలిపారు. అమీర్‌పేట నుంచి ఎర్రగడ్డ వరకు వెయ్యి మంది ఆటోడ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు తెలిపారు.

నమ్మకాన్ని వమ్ము చేయను : నవీన్‌యాదవ్

బంజారాహిల్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని ఆ పార్టీ అభ్యర్థి వి.నవీన్‌యాదవ్ అన్నారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాఘమయి దయానంద్‌తో కలిసి వెంగళరావునగర్‌లో శనివారం ఆయన పాదయాత్ర చేశారు. ఇంటింటికీ వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నవీన్‌యాదవ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే కాంగ్రెస్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అభివృద్ధిని చూసి అనేక సంఘాలు స్వచ్ఛందంగా తనకు మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్థానికులకు తినిపించారు.

బీఆర్ఎస్ నుంచి చేరికలు

ఎర్రగడ్డ డివిజన్ హేమావతి నగర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంజీవ్, విజయ్, యువ నాయకులు దినేష్, రాజకుమార్, సురేష్, హేమావతి నగర్ బస్తీ ప్రెసిడెంట్ బాలు,యూత్ ప్రెసిడెంట్ టింకు, కాంగ్రెస్‌లో చేరారు. నవీన్‌యాదవ్ వారికి కండువా కప్పి పార్టీలో కి ఆహ్వానించారు.

ఇతర రాష్ట్రాల ప్రజల మద్దతు

నవీన్‌యాదవ్‌కు ఇతర రాష్ట్రాల ప్రజలు మద్దతు పలికారు. ఎర్రగడ్డ హేమావతినగర్, పాండురంగానగర్, ఓల్డ్ శాస్త్రినగర్ పరిధిలో ఉన్న పలు రాష్ట్రాలకు చెందిన వారితో నవీన్ సమావేశమయ్యారు. బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు. టీపీసీసీ ఎన్నికల కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యురాలు సదాలక్ష్మి బోరబండలో ప్రచారం చేశారు.



నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



మాగంటి సునీతతో కలిసి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బీఆర్ఎస్‌ను గెలిపించాలి

ఎర్రగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అవినీతి, అరాచక పాలనను అంతం చేసేందుకు బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎర్రగడ్డ డివిజన్ నేతాజీనగర్, నటరాజ్‌నగర్ తదితర బస్తీల్లో మాగంటి సునీతతో కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా, కార్పొరేటర్లు సామల హేమ, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.



కల్లుగీత సహకార సంఘాల మద్దతు కాంగ్రెస్ పార్టీకి ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు తెలుపుతున్న సంఘం అధ్యక్షుడు అంబాల శంకర్‌గౌడ్

అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఎర్రగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీల్లో ప్రచారం చేశారు. ఎర్రగడ్డ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు అంబాల శంకర్‌గౌడ్ కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎర్రగడ్డ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, బోరబండ కల్లుగీత సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, వెంగళరావు నగర్ కల్లుగీత సంఘం అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, రహ్మత్ నగర్ కల్లుగీత సంఘం అధ్యక్షుడు హరిబాబుగౌడ్ పాల్గొన్నారు.

యాదవ సంఘాలు ఏకమవ్వాలి

యాదవ సంఘాలన్నీ ఏకమై కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని నవీన్ యాదవ్ అన్నారు. ఎర్రగడ్డలో నిర్వహించిన యాదవ కమ్యూనిటీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, యాదవ సంఘాల నాయకులు కంజర్ల సదాశివ యాదవ్, యాదగిరి యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్ర కృష్ణకుమార్, ఆకాష్ పాల్గొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఎర్రగడ్డ డివిజన్‌లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో సామ మద్దూర్, ఆశీర్వాదం, సెబాస్టియన్, స్టార్లిన్, సుధాకర్, బ్యాసిల్, నిర్మల పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘాల మద్దతు

యూసుఫ్‌గూడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నవీన్ యాదవ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ఆల్ ఇండియా ప్రైవేట్ బ్రాహ్మణ ఫెడరేషన్ సెక్రటరీ తులసి శ్రీనివాస్, ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ ద్రోణంరాజు రవికుమార్ తెలిపారు. యూసుఫ్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో వారణాసి వంశీ, బాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి: అడ్లూరి

బోరబండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం కావాలంటే ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కోరారు. బోరబండ డివిజన్ వినాయకరావునగర్ బస్తీలో ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా, బోరబండ డివిజన్ అధ్యక్షుడు బి.అశోక్ పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బోరబండ బస్టాప్ వద్ద లక్ష్మణ్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు.



వినాయకరావు నగర్ బస్తీలో ప్రచారం చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్



కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన టైలరింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

కాంగ్రెస్‌లో చేరిక

రహ్మత్ నగర్ డివిజన్‌కు చెందిన టైలర్స్, టైలరింగ్ అసోసియేషన్ సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 200 మంది కాంగ్రెస్‌లో చేరారు. టైలర్స్ సొసైటీ సభ్యులు గడ్డం రాజు, ఎం.డి.రషీద్, ఎం.డి.ఇస్మాయిల్, ఆత్మకూరి వెంకటేశ్, షేక్ కలీమ్, సత్యనారాయణ, రాధాశ్రీ పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి

యూసుఫ్‌గూడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ సర్కార్ రావాలంటే, బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకరెడ్డి అన్నారు. శనివారం వెంకటగిరిలో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెంకటగిరిలో ప్రచారం చేస్తున్న కార్తీకరెడ్డి

సింధికాలనీలో సుభాన్ బేకరీ ప్రారంభం

బేగంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింధికాలనీలో సుభాన్ బేకరీని మేనేజింగ్ చైర్మన్ ఇర్ఫాన్ తల్లి రసూల్ బి సాహిబా శనివారం ప్రారంభించారు. దీనికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల అభిమానం చూరగొనాలని సూచించారు. ఇర్ఫాన్ మాట్లాడుతూ 125 సంవత్సరాల క్రితం సుభాన్ బేకరి ప్రారంభమైందన్నారు. సికింద్రాబాద్‌లోని సింధికాలనీలో 4వ బ్రాంచి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



సుభాన్ బేకరీని ప్రారంభిస్తున్న రసూల్ బి సాహిబా, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



అన్నదానం చేస్తున్న ఈఓ మహేందర్ రెడ్డి

హనుమాన్ ఆలయంలో అన్నదానం

తిరుమలగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని శ్రీ హనుమాన్ దేవాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, అర్చన, ఆకుపూజ లాంటి ప్రత్యేక పూజలు అర్చకుడు వేణుగోపాల్ శర్మ చేశారు. ప్రతినెలా రెండో శనివారం హనుమాన్ సేవక్ ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు, అన్నదానం జరుగుతాయని ఈఓ మహేందర్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగానే శనివారం అన్నదానం నిర్వహించడం జరిగిందని తెలిపారు.

అయ్యప్పస్వాములకు అన్నప్రసాదం

బౌద్ధనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయంలో ఈ నెల 11వ తేదీ నుంచి మాల ధరించిన అయ్యప్పస్వాములకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గురుస్వామి జె.దేవేందర్ యాదవ్ తెలిపారు. శ్రీఅయ్యప్ప అన్నప్రసాద సమితి ఆధ్వర్యంలో 11వ తేదీ నుంచి 21వ తేదీ 3గంటల వరకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అయ్యప్పస్వాములు అన్నప్రసాదాన్ని స్వీకరించాలని సమితి అధ్యక్షుడు బండారి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జంగిలి దేవేందర్‌యాదవ్‌లు తెలిపారు.

ఆలయ సందర్శన



సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయాన్ని తెలుగు, కన్నడ సినీ నటుడు సత్యప్రకాష్ సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు అందుకున్నారు.

– సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడి నియామకం



వైశ్య సంఘం తుకారాంగేట్ అధ్యక్షుడు శ్రీకాంత్ మాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి నర్సింగ్‌రావు

అడ్డగుట్ట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య సంఘం తుకారాంగేట్ నూతన అధ్యక్షుడిగా తుకారాంగేట్‌కు చెందిన మల్లవేలు శ్రీకాంత్ మాదవ్, ప్రధాన కార్యదర్శి నాగబండి శ్రీనివాస్, కోశాధికారిగా నూకల నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులు కర్ణకోట శ్రీనివాస్, కొడారపు అశోక్‌లు నియమితులయ్యారు ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ వైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. త్వరలో కొత్త సభ్యులను ఏర్పాటు చేసుకుంటామన్నారు.

అలరించిన భరతనాట్యం



తుకారాంగేట్‌లోని పహాడి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో అన్నమయ్య చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారులు భరతనాట్యం చేసి అబ్బురపరిచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్, ఆలయ చైర్మన్ లక్ష్మణ్ ప్రసాద్, బీజేపీ నాయకులు ఉదయ్ కుమార్ యాదవ్‌లతో పాటు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

– అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

లక్ష దీపోత్సవం



● పహాడి హనుమాన్ ఆలయంలో లక్ష దీపోత్సవ పూజా కార్యక్రమం కనులపండువగా జరిగింది. కార్యక్రమంలో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ చార్జి సంతోష్ కుమార్, ఆలయ చైర్మన్ లక్ష్మణ్ ప్రసాద్, బీజేపీ నాయకులు ఉదయ్‌కుమార్ యాదవ్‌లతో పాటు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



● కార్తీకమాసం సందర్భంగా తుకారాంగేట్‌లోని పహాడి హనుమాన్ ఆలయం లక్ష దీపోత్సవ పూజలో భక్తులు పాల్గొని భజన చేశారు. జై హనుమాన్ అంటూ భక్తులు పాటలు పాడారు. ప్రత్యేక పూజ, హారతి, దీపోత్సవ పూజలు ఘనంగా జరిగాయి.

– అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి



తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ముషీరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ డివిజన్‌లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని స్థానిక డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని సాయిరెడ్డి పటేల్‌నగర్ అజార్‌గల్లీలో నూతనంగా చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని నెలలుగా స్థానికంగా లోప్రెషర్ నీటి సరఫరాతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాకు సమాచారం అందడంతో జలమండలి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, నాయకులు సత్యనారాయణ, విజయానంద్, బాలు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. జారి పడుడే

● అడ్డగుట్ట బి సెక్షన్‌లో ప్రమాదకరంగా మెట్లు

● స్పందించని అధికారులు



అడ్డగుట్ట బి సెక్షన్‌లో ప్రమాదకరంగా మెట్లు

అడ్డగుట్ట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట బి సెక్షన్‌లో ఉన్న నలభై ఏళ్ల నాటి మెట్లు ప్రమాదకరంగా మారడంతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మెట్ల మీదుగా ఎత్తయిన ప్రాంతంలో దాదాపు మూడు వందల ఇళ్ల వరకూ ఉంటాయి. ఎవరైనా సరే ఈ మెట్ల మీదు నుంచే రాకపోకలు సాగించాలంటే భయాందోళలనలకు గురవుతున్నారు. అలాగే వర్షం పడిన సమయంలో మెట్లకు పాకుడు పట్టడంతో మెట్ల మీది నుంచి కిందికి రావాలంటే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు మరమ్మతులు చేస్తారో తెలియకుండా పోయిందని మహిళలు వాపోతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, నాయకులకు కూడా ఫిర్యాదులు, విన్నపాలు కూడా చేశారు. ఏడాది క్రితం మెట్లకు మరమ్మతులు చేయడానికి మేజర్‌మెంట్ తీసుకున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఇంత వరకు కనిపించలేదు కదా పట్టించుకోలేదు.

వృద్ధులకు నరకం

ఈ మెట్ల నుంచి రాకపోకలు సాగించాలంటే వృద్ధులు, వికలాంగులు భయానికి గురవుతున్నారు. మెట్లపై అడుగు మీద అడుగేసి వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ఎమ్మెల్యే, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.



ప్రమాదకరంగా మారిన తాగునీటి మ్యాన్‌హోల్



ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ మ్యాన్‌హోల్

ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఇళ్లలో ఉంటున్నవారు బైకులను కిందనే పార్కు చేసి ఇంటికి చేరుకుంటున్నారు. ఆ బైకులు ఉన్నాయో ఎత్తుకెళ్లిపోయారో అని గంటకోసారి గమనించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం ఈ మెట్లను తొలగించి ఒక వైపు బైకు వెళ్లేందుకు దారి, మరో వైపు ప్రజలు నడవడానికి రెండు వైపులా మెట్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పలుమార్లు ఫిర్యాదు చేశాం



ప్రమాదకరంగా మారిన ఈ మెట్లు బాగు చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు, స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మిలకు ఫిర్యాదు చేశాం. ఇంత వరకు పట్టించుకోలేదు. మెట్లపైనుంచి జారిపడి ఆస్పత్రుపాలైన ఘటనలు ఎన్నో జరిగాయి. నాయకులు స్థానిక సమస్యల్ని పట్టించుకోరా, ఇంకేనాళ్లు ఈ దుర్భర పరిస్థితి.

– అయోధ్య, బస్తీవాసుడు

జారి పడుతున్నాం



ఈ మెట్లు కొన్నేళ్ల నాటివి. రాత్రి సమయంలో ఈ మెట్లపై వెళ్లాలంటే ఎక్కడ జారి పడిపోతామన్న భయంతో కిందికి దిగడంలేదు. వర్షంకాలంలో మెట్లకు పాకుడు పట్టి కాలు పెడితే ఏమవుతుందో అన్న భయం నెలకొంది. వృద్ధులు, వికలాంగులు ఒకరి సాయంతోనే కిందికి దిగుతున్నారు. అధికారులు ఈ సమస్యలపై స్పందించి ఈ మెట్లకు మరమ్మతులు చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలి.

– రేణుక, బస్తీవాసురాలు

సమాజంలో కలం యోధుల పాత్ర అమోఘం

● తెలంగాణ ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి



అయోధ్య రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఈ.రామకృష్ణ, ప్రతినిధులు

మారేడుపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి కలం యోధుల ప్రాత ఎంతో ప్రాముఖ్యమైందని తెలంగాణ ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి అన్నారు. శనివారం సికింద్రాబాద్ కార్ఖానాలోని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రాంతీయ కార్యాలయంలో కలం యోధుల సన్మాన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో వైశ్య పాత్రికేయులను ఆర్టీఐ కమిషనర్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఈ.రామకృష్ణతో కలిసి పాత్రికేయులను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సేవలను అభినందించారు. ఎక్కువ కష్టం, తక్కువ లాభంతో కూడిన వృత్తి పాత్రికేయులదని, వారి సేవలు సమాజానికి ఎంతో మేలు కలిగిస్తుంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ముఖ్య ప్రతినిధులతో పాటు, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి సుజాత రమేష్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సిద్ధ సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు దంపతులు

బౌద్ధనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నామాలగుండులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శనివారం పురస్కరించుకుని కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంను కనులపండువగా నిర్వహించారు. ఆలయచైర్మన్ నోముల ప్రకాశరావు, ఇందిరా ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకంచారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిట్ల రఘునందన్‌కుమార్, నాగులూరి శ్రీనివాస్‌గౌడ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యేలా విద్యాబోధన అందించాలి

● డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్

ముషీరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మరింత సులభంగా అర్థమయ్యేలా పాఠ్యబోధన చేయాలని డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్ సూచించారు. ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో శనివారం ప్ర త్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 5.0 కార్యక్రమంలో భాగం గా పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్క లు నాటి ఆహ్లాదకర వాతావరణాన్ని తీర్చిదిద్దాలి అన్నారు. ఐఎఫ్‌బి ప్యానల్ బోర్డుల ద్వారా విద్యార్థులకు విద్యాబోధన అందించడంతోపాటు ప్రతి పాఠశాలకు ఇంటర్‌నెట్ కనెక్షన్ తీసుకొని ఆధునిక పద్ధతులతో విద్యను అందించాలని సూచించారు. ఖాన్ అకాడమీ ద్వారా ఫిజిక్స్, గణితం, బయాలజీ పాఠ్యాంశాల ను బోధిస్తూ పిల్లలకు వచ్చే అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. అలాగే సమాజంపై అవగాహన కల్పించేందుకు నిత్యం అవసరముండే బ్యాంకులు, పోస్టాఫీసులు, రైల్వే స్టేషన్లు తదితర ప్రధాన సేవలు అందించే సంస్థలకు తీసుకెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయే 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా బోధనను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, భవాని, శోభారాణి, మీనాకుమారి, తారామణి తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సుల ప్రాధాన్యతపై అవగాహన

కుషాయిగూడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ కల్పనలో కంప్యూటర్ కోర్సుల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ శనివారం 'క్యాడర్' సంస్థ ప్రతినిధులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్ బ్రాంచ్ ప్రతినిధి పి.నాగరాజు మాట్లాడుతూ టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో ఇంటర్/డిగ్రీ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ కంప్యూటర్ కోర్సులతో పాటు కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషు కోర్సులను ప్రతి రోజూ నాలుగు గంటల పాటు శిక్షణనిస్తున్నట్లు వివరించారు. కోర్సు పూర్తయిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని, ఆసక్తి ఉన్న 18 నుంచి 27 యేళ్ల లోపు వయసు వున్న వారు ఇతర వివరాలకై ఫోన్ 91000 56583, 8885512037 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పవర్ బోర్‌కు మరమ్మతు పనులు



మరమ్మతులను పరిశీలిస్తున్న గడ్డం నవీన్ తదితరులు

రాంనగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : రాంనగర్ డివిజన్‌లోని హరినగర్‌తో పాటు పలు బస్తీల్లో నిరుపయోగంగా మారిన పవర్ బోరింగ్‌లకు జలమండలి అధికారులు శనివారం మరమ్మతులు చేపట్టారు. బోరింగ్‌లకు మరమ్మతు చేపట్టాలని బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గడ్డం నవీన్ ఇటీవల జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన అధికారులు బోరింగ్‌లకు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులను శనివారం గడ్డం నవీన్‌తోపాటు హరినగర్ బస్తీవాసులు పరిశీలించారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

రాంనగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే ముఠా గోపా ల్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన రహదారులతోపాటు కాలనీలు, అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ముషీరాబాద్ మెయిన్ రోడ్ నుంచి బాకారంలోని బందన్ ఫంక్షన్ హాల్ వరకు కోటి రూపాయల వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేసినందుకు గానూ బాకారం బొ మ్మలగుడి బస్తీవాసులు శనివారం బొమ్మలగుడి చౌరస్తాలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరం కాలంగా ఈ ప్రధాన రహదారి గుంతలమయంగా మారడం, సాగర్‌లాల్ ఆస్పత్రి వద్ద వర్షం, డ్రైనేజీ నీరు నిలిచిపోయి స్థానిక ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు నరకయాతన అనుభవించారని తెలిపారు. వారి విన్నపాల మేరకు తాము నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి కోటి రూపాయలను మంజూరు చే యించి వేశామన్నారు. నూతనంగా వేసిన రోడ్డుతో స్థానిక ప్రజలెదుర్కొంటున్న దీర్ఘకాలిక రోడ్డు సమస్య శాశ్వతంగా పరిష్కారమైందన్నారు. ము ఠా జైసింహ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేస్తున్న ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు.

ఈ కార్యక్రమానికి పార్టీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు టి.శంకర్‌ముదిరాజ్ అధ్యక్షతన నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్ర భాకర్, దీన్‌దయాల్‌రెడ్డి, గోక నవీన్, ముదిగొండ మురళీ, కల్యాణ్‌నాయక్, బస్తీనాయకులు శ్రావణ్, ప్రవీణ్, రేహన్‌ఖాన్, వెంకటేశ్వర్, రమేష్, జబ్బర్, ప్రేమ్, సైదులు, రాంరెడ్డి, ఎర్రం శేఖర్, మల్లేష్‌యాదవ్, జ్ఞానేశ్వర్‌గౌడ్, మధు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బాకారం బొమ్మలగుడి బస్తీవాసులు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

సాయినగర్ కాలనీలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు

● పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానికులు

ఏఎస్‌రావునగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ సాయినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేయబోయే మద్యం దుకాణంను ఏర్పాటు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ కాలనీ వాసులు కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే అసాంఘిక కార్యకలాపాలు పెరిగే ప్రమాదం ఉందని, కాలనీ మహిళలు, పిల్లలు అటువైపుగా వెళ్లాలంటే జంకే పరిస్థితి ఉంటుందని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కాలనీ వాసుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని వెంటనే మద్యం దుకాణం ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ఎల్.భాస్కర్‌రెడ్డిని కలిసిన వారిలో చర్లపల్లి కాలనీల సమాఖ్య అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, కాలనీ అధ్యక్షుడు సారా వినోద్, ఇతర ప్రతినిధులు ఉన్నారు.



జీవోసి-ఇన్-సీ, ఆర్మీ ట్రైనింగ్ కమాండ్ బ్యానర్‌ను వింగ్ కెడెట్ అఖిలేష్ ధ్యానీకి అందిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షనే

సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశరక్షణలో సద్వినియోగం చేసుకోవాలి

● ఎంసీఈఎంఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షనే

అల్వాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానానిదే కీలకపాత్ర అని ఎంసీఈఎంఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షనే అన్నారు. శనివారం సికింద్రాబాద్‌లోని ఎంసీఈఎంఈ ఆడిటోరియంలో నిర్వహించిన టెక్నికల్ ఎంట్రీ స్కీమ్- 46 కోర్స్ పూర్తి చేసిన కెడెట్స్ పాసింగ్ ఔట్ పరేడ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 23 మంది సైనిక అధికారులు (వీరిలో రాయల్ భూటాన్ ఆర్మీకి చెందిన ఇద్దరు కెడెట్స్ ఉన్నారు). లెఫ్టినెంట్ హోదాలో కమిషన్డ్ అధికారులుగా ఎంపికైన జెంటిల్మెన్ కెడెట్స్‌కు ఈ పరేడ్ చిరస్మరణీయమైన రోజన్నారు. సాంకేతిక ఆధారిత యుద్ధ పద్ధతులకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని, 'ఆపరేషన్ సిందూర్'లో ప్రదర్శించిన టెక్నాలజీ ఆధారిత యుద్ధ నైపుణ్యాల ప్రదర్శనను ఆయన ఈ సందర్భంగా కెడెట్స్‌కు వివరించారు. ఎంసీఈఎంఈ కెడెట్స్ కు కావల్సిన నాణ్యమైన శిక్షణను, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అత్యాధునికమైన శిక్షణను అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా మెరిట్ క్రమంలో మొదటిస్థానంలో నిలిచిన వింగ్ కెడెట్ అఖిలేష్ ధ్యానికి ప్రతిష్టాత్మకమైన జీవోసి-ఇన్-సీ, ఆర్మీ ట్రైనింగ్ కమాండ్ బ్యానర్‌ను ప్రదానం చేశారు. దాంతో పాటు బంగారు పతకం అందజేశారు. భూటాన్‌కు చెందిన ప్లాటూన్ కెడెట్ కెప్టెన్ టెంజిన్ దోర్జి కి బెస్ట్ అవుట్ డోర్ ట్రైనింగ్‌లో గోల్డ్ మెడల్ అందుకున్నారు. పృథ్వీరాజ్‌కు ప్లాటూన్ బానర్‌ను అందుకున్నారు.



రోగులకు పండ్లు అందిస్తున్న అరుణ్ పటేల్

హోమియోపతి ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

రామంతాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హబ్సిగూడ డివిజన్ పరిధిలోని రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రిలో శనివారం రోగులకు యువజన కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ అధ్వర్యంలో పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యం లో విరివిగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా, నియోజకవర్గం, డివిజన్ స్థాయి నాయకులు కిషోర్, వాసు నాయక్, గుమ్మల భాను, భాస్కర్, సుమిత్, తరుణ్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.